# మినీ కథ

## "లోకం తీరు"

## శ్రీమతి సరస్వతీ గోపాల్

ఆంధ్రదేశంలో ఓ పల్లెటూరు.

"పిల్లలందర్నీ పిలిపించు. ఆఖరుగా చూసి మరీ చచ్చిపోతాను." కొన ఊపిరితో మంచంమీదున్న ఆనందరావు భార్యని కోరుకున్నాడు.

డాక్టర్లు కూడా పెదవి విరిచి గంటలో, క్షణాలో లెక్క పెట్టుకోమనడంతో పిల్లలందరికీ టెలిగ్రాములు పంపబడ్డాయి.

తొమ్మండుగురు పిల్లలు సపరివార సమేతంగా హడావుడిగా ఆ ఊరికి చేరుకున్నారు.

మంచం మీద మనిషిని చూసి ఉమ్మడిగా ఓ గంట దుఃఖించారంతా.

ఎగిరిపోబోయిన ఆనందరావు ప్రాణానికి మళ్ళీ ఆశ కలిగినట్టుంది పైకము పొడిగించుకుంటోంది.

నా పిల్లలు...అంటూ సంతృప్తి పడిపోయాడానందరావు.

ఇంకో గంటకి...

ప్రయాణపు బడలికలు తీరేలా వేణ్ణీళ్ళ స్నానాలు కానిచ్చి ఫ్రెష్‌గా తయారయి కొడుకులు, అల్లుళ్ళు పేకాటకి ఓ మూలగది చూసుకుని జంబుఖానా పరిస్తే...

కోడళ్ళు కూతుళ్ళు పిచ్చాపాటికి వసారాలో చేరారు.

పిల్లలు ఆరుబయట ఆటలు మొదలెట్టారు.

"వెధవ పల్లెటూరు! (తను పుట్టిందక్కడే) బొగ్గుగనుల్లో పనిచేసే వాళ్ళలా అయిపోతాం ప్రయాణంలోనే ఈ ఊరు వచ్చేసరికి" విసుక్కుంది ఆనందరావు పెద్ద కూతురు.

"యూజ్ క్రౌనింగ్ గ్లోరీ!" టి.వి.లో ఎడ్వర్టయిజ్‌మెంటులా అనేసి వెళ్ళిపోయాడు పెద్దతమ్ముడి కొడుకు.

"మా టి.వి. కొన్నాక పిల్లల జనరల్ నాలెడ్జి బాగా పెరిగిపోయింది." మురిపెంగా అంది పిల్లాడి తల్లి తాము టి.వి. కొన్నామని డైరెక్ట్‌గా చెప్పకుండా.

ఏది కొన్నారు! ఏకంగా కలరే తీసుకోపోయారా! (ఆ మీకేం కొనగలర్లే అన్నట్టని)

"కలరే...కంపెనీది!"

"ఆ...కంపెనీయా! దాని ఖరీదు కూడా తక్కువే! మేం కొందామనుకుంటున్న... కంపెనీది పదివేలు. మంచి కంపెనీ! మీరు కొన్నలాంటిదే కొందామనుకుని మంచిది కాదన్నారని మానుకున్నాం!" గొంతునిండా అహం.

"ఏదిఏమైంది! కొనలేక కబుర్లు. ఏమైనా కాకపోతే కంపెనీతో ఏ ముందక్కా! పార్ట్లన్నీ ఇంపోర్టెడ్‌వే!" తోటికోడళ్ళు రహస్యంగా చెవులు కొరుక్కున్నారు.

సాయంత్రం...

"మీ చిన్నాడేం చదువుతున్నాడు వదినా!" పెద్దాడపడుచు నడిగింది ఆనందరావు రెండో కోడలు.



# మినీ కథ

"సెంట్రల్ స్కూల్లో సెవెంత్ కొచ్చాడమ్మా! ఎంత సిలబస్! ఎంత కష్టం! అయితే అయిందిగానీ ఆంధ్రాలో మీ పిల్లల స్టాండర్డ్‌తో పోలిస్తే చాలా ఎక్కువ. మీ ఆంధ్రాలో (తనెక్కడో పుట్టినట్లు) నాన్ డిటెన్షన్ సిస్టమట కదా! హేళనగా అడిగింది పదిసగారు మనవల్ని.

"ఇక్కడ మా పిల్లలూ సెంట్రల్ స్కూల్లోనే చదువుతున్నారు. మీ పిల్లలది, మా పిల్లలది ఒకే సిలబస్, మా పిల్లలెప్పుడూ ఫస్ట్‌లే! మనవలు సమాధానం.

"అమ్మా! ఈ సారి అన్నయ్యకి పద హారో రాంక్ వచ్చిందని డాడీ కొట్టారు కూడా కదే!" మంచినీళ్ళ గ్లాసు గడానికి లోపలికొచ్చిన ఆవిడ పదేళ్ళ కొడుకు మెల్లగా అని జారుకున్నాడు.

విసవిసా లేచి వాడివెంట పడింది తల్లి.

అభిప్రాయభేదాలు అలకలతో చూస్తుండగానే రెండు రోజులు గడిచి పోయాయి.

కొడుకులు అల్లుళ్ళ పేకాటని మాస్టర్ చేసి విసుగెత్తి పోయారు.

"మనం వచ్చిన రోజే 'అపుడ్' అనుకున్నారు. ముసలి ప్రాణం, రెండురోజులైనా ఆ లక్షణాలేం లేవు. రోజులు తరబడి కూర్చోడానికి మావేం అల్లాటప్పా ఉద్యోగాలా!" కొడుకుల విసుగు.

"ఎవరి పనులు వాళ్ళు చూసుకుని ఏం చూస్తుంటాం? తీరా వెనక్కి పోదామంటే.. మనం అటు వెళ్ళగానే పటుక్కు మంటాదేమో!" అల్లుళ్ళ బాధ.

"పిల్లల చదువులు పాడయి పోతాయి. అసలే సెంట్రల్ సిలబస్. వచ్చేసరికే అసలు అంతా అయిపోయుంటుందనుకున్నాం. వచ్చి ఇక్కడ ఇరుక్కుపోయాం." కోడళ్ళ సణుగుడు.

"ఛ! ఈ ఊరేంటి? ఓ టి.వి. లేదూ పాడూలేదు! తాతయ్యకి బుద్ధిలేదా? టి.వి. కొనుక్కోలేదేం? రెండు రోజుల్లో ఎన్ని సీరియల్స్ మిస్సయ్యామో!" పిల్లల గోల.

చిన్నతనాన నిద్రాహారాలు సైతం లెక్కచేయక స్వసుఖాలు త్యాగం చేసుకుని ప్రాణంకన్న మించిన తన పిల్లల్ని అభివృద్ధికి సారిగా చూడాలని ఆరాటపడ్డ ఆనందరావు ప్రాణం లోకంతీరు అర్థం చేసుకున్నట్లు, ఇంకా అక్కడుండకని రివ్వున ఎగిరి పోయింది.



గమనిక : (శ్రీమతి సరస్వతీ గోపాల్ తమ పూర్తి విలాసం తెలియచేయవలసిందిగా కోరుతున్నాం.) -ఎడిటర్

## మీరేం చేస్తారు?

*స్రవంతి నెం: 12లో 'మీరేం చేస్తారు'లో ఇచ్చిన*

లాకప్ మరణాల విచారణలో మిమ్మల్ని ఏకపక్ష న్యాయ నిర్ణేతగా చేస్తే?

*విషయానికి ఎన్నికైన సమాధానాలు. మొదటి ఇద్దరికీ ఒక్కొక్కరికీ పదిరూపాయలు పారితోషికం.*

- నాకింత ఘోరమైన శిక్షవేసినందుకు విచారిస్తా. ఆపైన అన్ని సాక్ష్యాలు, ఋజువులు సేకరి(ంచినట్టు నటి)స్తా. తర్వాత రిపోర్టు ఇలా పంపిస్తా:- ఏ ఒక్కడు లాకప్‌లో మరణించలేదని. అంతా ఆత్మహత్య చేసుకునే చచ్చిపోయారని, మన రక్షక భటుల తప్పు పీసమంత కూడా లేదని. ఎందుకంటే మరి, "లాకప్ మరణాల విచారణా న్యాయమూర్తి శ్రీ కె. భాస్కరరావ్ లాకప్‌లో మరణం" అని మర్నాటి న్యూస్ పేపర్‌లో రాకూడదని ఆశ! నాకూ బ్రతకాలనే ఉంటుంది కదా!

  —కె. భాస్కరరావు,
  ట్రావెలర్స్ బంగళా ఎదురుగా
  జంగారెడ్డిగూడెం-534447.

- దేశంలో ఏఏ పోలీస్‌స్టేషన్లలో ఎక్కువగా లాకప్ మరణాలు జరిగాయో అక్కడ ఆ సమయంలో ఎవరు డ్యూటీలో ఉన్నారో రిపోర్టు తయారు చేసి తెమ్మంటాను. వాళ్ళు తెచ్చిన రిపోర్టు పరిశీలించి అందులో ముగ్గుర్ని ఎన్నిక చేస్తాను. వారికి ఫస్ట్, సెకండ్, థర్డ్ మూడు ఆకర్షణీయమైన బహుమతుల ప్రదానం చేయిస్తాను. మొదటి వారికి లాకప్ మరణబ్రహ్మ అనేబిరుదు ఇప్పిస్తాను. వారుఅనుసరించినపద్ధతులు వారి అనుభవాలతో ఒక పుస్తకం రాయిస్తాను. ఆపుస్తకం భారతదేశంలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఒక కాపీ పంపిస్తాను. ఆ పుస్తకంలో నాను తి కొంచెం రాస్తాను. 'దేశంలో జనాభా పెరుగుతున్న దృష్ట్యా లాకప్ మరణాలు ఎంతో అవసరం కనుక ఈ పుస్తకం మీకు ఎంతో ఉపయోగ పడుతుందని ఆశిస్తున్నాను. ఇందులో లా.మ.బ్ర. గారి పద్ధతులు నాకు ఎంతగానో నచ్చాయి. ఖైదీని ఎన్ని విధాలుగా హింసించవచ్చునో చక్కని ఉదాహరణలతో వివరించారు. కేసులు లేకుండా ఎలా చేయవచ్చునో చూపించారు. మీరందరు లా.మ.బ్ర. గారిని ఆదర్శం చేసుకొని క్రొత్త క్రొత్త ప్రయోగాలు చేయగలరని ఆశిస్తున్నాను. ఇట్లు

  —వి. సత్యనారాయణ
  ఇండస్ట్రియల్ ఏరియా అపర్‌ఫుడ్స్
  తా.పో. జహీరాబాద్
  జిల్లా. మెదక్-502220

- అయ్యా! స్రవంతి ఎడిటర్‌గారూ! దేశంలో ఇంతమంది వుండగా చెపులో పువ్వెట్టుకుని నేనే కనిపించానాబాబూ! పిల్లలుగలవాణ్ణి, అందులోనూ ఆడపిల్లలు. వలవలా ఏడుపువస్తోంది. పైనుంచి లాకప్‌లో మరణించిన వారందరూ క్యూలో నుంచుని "రా! గురూ! నీదే ఆలస్యం" అని పిలుస్తున్నట్టు భ్రాంతి, కళ్ళు తిరుగుతున్నాయి. కాళ్లు వణుకుతున్నాయి ... చుట్టూ అంతా చీకటి. కంపు, ఎక్కడున్నానేను? అయోమయంగా వుంది పరిస్థితి. "ఎవరో లాకప్ మరణాల ఏకపక్ష న్యాయనిర్ణేతలు సార్! నాలుగుతగిలిచ్చిలోక్కలో పడేశా! ఏం చెయ్యమంటారు?" కర్కశ కఠోరంగా బొంగురు గొంతు.

  కళ్ళు తిరిగినయి, కథ అర్థమైంది.

  అయ్యా! స్రవంతి ఎడిటర్‌గారూ! ఏం చెయ్యకుండా వుండేనే ఇక్కడ ఇలా వున్నాను. సెలవు. ఈజన్మకు గుడ్‌బై"

  —సుచంద్ర (ఖమ్మం)

- 'లా' విధించిన మరణ శిక్షను లాకప్‌లోనే విధించినందుకు వారిని అభినందిస్తాను.

  లాకప్ మరణాలవల్ల ఒకదెబ్బతోరెండు పిట్టలన్నట్లు, ప్రజల్లో భయంపెరిగి దొంగతనాలు, నేరాలు చాలావరకు తగ్గిపోతాయి. రెండవది విపరీతంగా పెరిగిపోతున్న జనాభాను అరికట్టేందుకు రైల్వేశాఖకు పరోక్షంగా సహాయపడుతున్నందుకు వారికి ప్రమోషన్ కొరకు రికమండ్ చేస్తాను.

  —షేక్ నభిరామ్,
  (ఖమ్మం-507112.)